
ఆంధ్రజ్యోతి

**

ANDHRAJYOTHY



సూర్యాపేట

3

మంగళవారం 5 మార్చి 2024

హెల్ప్‌లైన్ నంబర్లు

దివ్యాంగులు, సీనియర్ సిటిజన్స్ సంక్షేమ శాఖ టోల్‌ఫ్రీ నెంబర్ 18005728980

నల్లగొండ	: 18004251442
యాదాద్రి	: 1800 425 7106
సూర్యాపేట	: 1800 425 1972

చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 60

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.145	215	244
సూర్యాపేట	రూ.165	230	260
నల్లగొండ	రూ.146	206	246

ఉష్ణోగ్రత గరిష్ఠం 36.5 । కనిష్ఠం 24.0

సాగుకు 24 గంటలు



» వ్యవసాయ విద్యుత్‌పై అలర్ట్! » సాగుకు 24గంటల నిరంతర సరఫరాకు ఆదేశాలు

» అధికారులు, సిబ్బంది నడుమ సమన్వయలోపముంటే చర్యలు » జిల్లాలో విద్యుత్ సరఫరాపై డిస్కం సీఎండీ ముషారఫ్ సమీక్ష

వ్యవసాయ రంగానికి విద్యుత్‌సరఫరాపై అధికారులు అప్రమత్తమయ్యారు. జిల్లాలో వ్యవసాయానికి విద్యుత్ వినియోగం పెరగడంతో కోతల్లేకుండా సరఫరా చేసేందుకు యాక్షన్ ప్లాన్ రూపొందించారు. పంటలు చేతికందె వరకూ ఏక్షణంలో కూడా కరెంటు లేకపోవడం వల్ల పైరు ఎండిందనే అపవాదు రావద్దనే స్పష్టమైన లక్ష్యంతో రంగంలోకి దిగుతున్నారు. సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో విద్యుత్ అధికారుల ఉన్నతస్థాయి సమీక్షలో సదరన్ డిస్కం సీఎండీ ముషారఫ్ సాగు రంగానికి విద్యుత్ సరఫరాపై ఉద్యోగులకు, సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

(ఆంధ్రజ్యోతిప్రతినిధి- నల్లగొండ)

నల్లగొండ జిల్లాలో నిడమనూరు,త్రిపురారం మండలాల్లో ఫిబ్రవరిలో విద్యుత్ కోసం రైతులు ధర్నా చేసిన అంశంపై ప్రభుత్వం సీరియస్‌గా స్పందించి విచారణకు ఆదేశించడంతో ఉన్నతాధికారుల్లోనూ కదలిక వచ్చింది. విద్యుత్‌కోతలపై ధర్నాలకు సరఫరాలోటు సమస్య కానేకాదని, ఉద్యోగుల మధ్య సమన్వయలోపమే కారణంగా విచారణ కమిటీ తేల్చడంతో నల్లగొండ ఎస్ఈకి, మిర్యాలగూడ డీఈకి చార్జిమెమోలు జారీ చేయగా, తాజాగా సోమవారం మిర్యాలగూడ డీఈపై బదిలీవేటు వేయడం ద్వారా అధికారులు, ఉద్యోగులకు చురక తగిలించినట్లైంది.

యాసంగి సాగుకు అనూహ్యంగా పెరిగిన విద్యుత్ వినియోగం

జిల్లాలో యాసంగి సీజన్‌లో నాగార్జునసాగర్, ఏఎమ్మార్పీ, మూసీ ప్రాజెక్టుల కింద క్రాప్ హాలిడే ప్రకటించడం, దానికితోడు భూగర్భజలాలు అడుగంటడంతో ఈసారి యాసంగిసాగుకు విద్యుత్ వినియోగం అనూహ్యంగా పెరిగింది. పండ్ల తోటలతో పాటు యాసంగి పంటలకు పూర్తిగా బోరుబావుల నీరే ఆధారమైంది. ఎండలు పెరగడం, భూగర్భజలాల నీటిమట్టాలు పడిపోవడంతో బోరుబావులకు విద్యుత్‌వినియోగం అనివార్యంగా పెరిగింది. ఈ డిమాండ్ నేపథ్యంలో మార్చిలో గరిష్ఠంగా 25ఎంయూడీ (మిలియన్ యూనిట్స్ పర్ డే) విద్యుత్ అవసరముంటుంద నే అంచనాతో సరపరాలో లోటులేకుండా చూసేందుకు ప్రభుత్వం గ్రిడ్‌ల నుంచి విద్యుత్ సరఫరాకు సన్నాహాలు చేసింది. గతేడాది ఈ సీజన్‌లో సుమారు 18 నుంచి 19 మిలియన్‌యూనిట్ల వాడకం ఉంటే, ఈసారి దాదాపు 40 శాతానికి పైగా డిమాండ్ పెరిగిందని అధికారులు చెబుతున్నారు. ఎంతడిమాండ్ ఉన్నప్పటికీ విద్యుత్ సరఫరాలో లోటు లేకుండా చూస్తామని ప్రభుత్వం ఆదేశాలివ్వడంతో క్షేత్రస్థాయిలో పంపిణీలో లోపాల్లేకుండా చూసేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలిస్తున్నారు. నల్లగొండ జిల్లాలో 2,17,660 వ్యవసాయ కనెక్షన్లుంటే, తాజాగా ఈ రెండు నెలల్లో 10వేల వరకు అదనపు వ్యవసాయకనెక్షన్లు ఏర్పాటయ్యాయని చెబుతున్నారు.



కరెంటు లేక పైరు ఎండిందన్న మాటే రావద్దు

"వ్యవసాయానికిచ్చే విద్యుత్ సరఫరాలో ఎక్కడా రాజీపడొద్దు. కరెంట్ లేక పైరు ఎండుతుందనే మాటే రావద్దు. ప్రభుత్వ నిర్ణయం మేరకు వ్యవసాయఫీడర్లకు 24 గంటల నిరంతర సరఫరా కొనసాగాలి. రైతులు ఏ సమయంలో పంపుసెట్లు నడుపుకోవాలంటే ఆ సమయంలో ఆటంకం లేకుండా విద్యుత్ సరఫరా ఉండాలి. ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల మరమ్మతులుంటే జాప్యం లేకుండా పనులుచేయాలి. డిస్కం అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది సమన్వయంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేలా పనిచేయాలి.

- ముషారఫ్, సదరన్ డిస్కం సీఎండీ.



వ్యవసాయ ఫీడర్లకు నిరంతర సరఫరా

జిల్లాలో వ్యవసాయ ఫీడర్లకు నిరంతరం త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కొనసాగించాలని ఉన్నతాధికారులు స్పష్టమైన ఆదేశాలిచ్చారు. 24 గంటలూ ఫీడర్లకు సరఫరా ఇవ్వాలని, రైతు తన బోరుబావి పంపుసెట్టును ఏ సమయంలో నడపాలని భావిస్తే, ఆ సమయంలో మోటారు పనిచేసేలా విద్యుత్ సరఫరా ఉండడమే తమ లక్ష్యంగా ప్రతి ఉద్యోగి పనిచేయాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. ప్రధానంగా ఎండాకాలంలో ఎదురయ్యే ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులకు రోజుల తరబడి సమయం తీసుకోవద్దని, విద్యుత్ అధికారులే ట్రాన్స్‌పార్మర్లు తీసుకువచ్చి ఒకే రోజులో మరమ్మతుచేసి మళ్లీ కనెక్షన్ పునరుద్ధరించాలని తాజా సమీక్షలో స్పష్టమైన ఆదేశాలిచ్చారు. ఎల్‌సీల విషయంలోనూ ప్రణాళికలేకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తే కఠినచర్యలు తీసుకోవాలని ఆదేశించారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, ఇతర ఏవైనా సమస్యలు తలెత్తినా ఉన్నతాధికారుల సూచనలతో అతిస్వల్ప సమయంలో పూర్తయ్యేలా చూడాలని అంతిమంగా వ్యవసాయానికిచ్చే విద్యుత్ సరఫరాలో ఎక్కడా లోటు లేకుండా చూడాలని ఆదేశించడం ద్వారా క్షేత్రస్థాయి ఉద్యోగులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు.

ఎండలు మండే

జిల్లాలో ఎండల తీవ్రతకు ప్రజలు తల్లడిల్లుతున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి రెండో వారం నుంచి ఎండలు అధికంగా నమోదవుతున్నాయి. ఈ నెలలో ఎండలు ఇంకా అధికంగా నమోదయ్యే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. మరో మూడు నెలలపాటు అంటే జూన్ మొదటి వారం వరకు ఎండలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశాలు ఉన్నాయి. ఏప్రిల్, మే మాసంలో ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని వాతావరణ శాఖ ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. జిల్లాలో అప్పుడే 36 డిగ్రీలకు పైగా పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి.

- నల్లగొండ

భానుడి భగభగతో తల్లడిల్లుతున్న ప్రజలు
ఉదయం 9 గంటల నుంచే వాతావరణంలో వేడి



నిర్మానుష్యంగా నల్లగొండలోని దేవరకొండ రోడ్డు



ప్రస్తుతం సాధారణం కంటే అధికంగానే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. కనిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా గరిష్ఠ ఉష్ణోగ్రతలకు పోటీపడేలా ఉంటున్నాయి. రాబోయే రోజుల్లో ఎండలకు తోడు వడగాడ్పులు కూడా వీచే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ పేర్కొంది. అదేవిధంగా వడగాడ్పులతో పాటు వేడి వాతావరణం రోజుకు ఎక్కువైతే ప్రజలకు ఇబ్బందులు తప్పేలా లేవు.గత ఏడాది వర్షాలు సరిగ్గా లేకపోవడంతో భూమిలో వాతావరణం వేడెక్కిందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. వాతావరణంలో తేమశాతం తగ్గటం భూమిలో వేడి ఎండలను మరింత ఎక్కువ ఉండేలా పరిస్థితులు ఏర్పడ్డాయి.

ఎండలో ప్రజలకు జాగ్రత్తలు తప్పనిసరి

రోజురోజుకూ ఎండలు పెరుగుతుండడంతో బయటకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు. లేకుంటే అనేక అనారోగ్యానికి గురవుతారని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల నీళ్లు తాగితే ఎండ నుంచి బయటపడవచ్చు. సాధారణంగా వివిధ పనులపై వెళ్లే వారితో పాటు ఉద్యోగాలు చేసేవారు సైతం జాగ్రత్తలు తీసుకుంటూ అదనంగా మరో లీటర్ నీరు అంటే నాలుగు లీటర్లు తాగాల్సి ఉంటుందని సూచిస్తున్నారు. వేసవిలో చెమట రూపంలో అధికంగా శరీరం నుంచి నీరు బయటకు వెళ్లిపోతుంది. దీంతో ఎప్పటికప్పుడు నీటిని తాగుతూ రక్షణ కల్పించుకోవాల్సిన అవసరం ఉందని వైద్యులు తెలిపారు. శరీరంలో ఉష్ణోగ్రతల మార్పులతో తలనొప్పి, జ్వరం, గొంతులో మంటలు వంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. ఎండలో బయటికి వెళ్లి వచ్చినవారు కనీసం ఐదు నిమిషాల విశ్రాంతి తీసుకోవాలి.

చల్లటి పానీయాలకు భలే గిరాకి

ఎండలు మండుతుండటంతో ప్రజలు చల్లటి పానీయా ల వైపు చూస్తున్నారు. కూల్ డ్రింక్‌లతో పాటు చెరుకు రసం, పుచ్చకాయలు, ఐస్ క్రీం, మజ్జిగ, లస్సీ వంటివి అధికంగా తీసుకుంటున్నారు. చల్లటి పానీయాలకు ధరలు కూడా మండుతున్నాయి. కూలర్లు కూడా పెద్దఎత్తున విక్రయాలు జరుగుతున్నాయి. మధ్యతరగతి ప్రజలు కూలర్లు వాడుతుండగా కాస్త ఆర్థికంగా ఉన్నవారు ఏసీలను వినియోగిస్తున్నారు.

జిల్లాలో ఉష్ణోగ్రతలు(సెంటీగ్రేడ్లలో)

తేదీ	కనిష్ఠం	గరిష్ఠం
27న	24.2	34.0
28న	23.4	34.5
29న	23.8	35.0
1న	23.4	34.5
2న	23.6	35.0
3న	23.8	36.0
4న	24.0	36.5

ఎండలతో అప్రమత్తంగా ఉండాలి

ఎండలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. వీలైనంత మేరకు ఉదయం సాయంత్రం వేళల్లో పనులు చూసుకోవాలి. అవసరమైతేనే బయటకు వెళ్లాలి. బయటకు వెళ్లేవారు గొడుగుతో పాటు టోపీని ధరించాలి. వీలైనంత మేరకు వదులుగా ఉన్న దుస్తులతో పాటు కాటన్ దుస్తులు ధరించాలి. జీన్స్‌తో పాటు పాలిస్టర్ వంటి దుస్తులను సాధ్యమైనంత వరకు వేసవిలో దూరంగా ఉంచాలి.

- విఠల్‌బాబు, ఎండీ జనరల్ ఫిజిషియన్





నల్లగొండ జిల్లా నాగార్జున సాగర్‌లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా

మార్చి నెల మొదటి వారంలోనే ఎండలు సుర్రుమంటున్నాయి. ఏడాది కాలంగా నల్లగొండ జిల్లాలో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవడంతో భూగర్భజలాలు అడుగంటిపోయాయి. వ్యవసాయ బావు లు పూర్తిగా ఎండిపోగా 200 అడుగుల లోతుకు మించి బోర్లు వేస్తేనే ఆగి ఆగిపోస్తున్నాయి. చెరువులు, కుంటలు సైతం వట్టిపోవడంతో అనేక గ్రామాల్లో తాగు నీటి సమస్య నెలకొంది. వేసవి తీవ్రరూపం దాల్చకముందే నివారణ చర్యల్లో భాగంగా అధికారులు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు తెలుస్తోంది.

- (మిర్యాలగూడ)



పల్లెల్లో తాగునీటికి కటకట

» అనేక గ్రామాల్లో సరఫరా కాని భగీరథ నీరు
» ట్యాంకర్ల నీటిని కొనుగోలు చేస్తున్న జనం
» మంచినీటి ఎద్దడి నివారణకు ప్రత్యేక కార్యాచరణ
» ఉమ్మడి జిల్లాలో రూ, 17 కోట్లకు ప్రతిపాదనలు

దేవరకొండ, నాగార్జునసాగర్, మిర్యాలగూడ, హుజూర్ నగర్ నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో ప్రజలు మంచి నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. ఈ ఏడాది వర్షాలు సరిగా కురవకపోవడం, కృష్ణానదికి వరద సైతం రాకపోవడంతో జలాశయంలో నీటినిల్వలు గణనీయంగా పడిపోయాయి. ఫలితంగా ఎడమకాల్వ ఆయకట్టుకు నీటివిడుదల జరగలేదు. ఆయకట్టులో యాసంగి క్రాప్ హాలిడే ప్రకటించారు. రైతులు పంటల సాగుకు బోర్లు, బావులపైనే ఆధారపడాల్సి వచ్చింది. అధిక సంఖ్యలో బోర్ల వినియోగంతో కృష్ణపట్టెలో భూగర్భజలాలు తగ్గిపోయాయి. నల్లగొండ జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 18.6 శాతం లోటుగా నమోదైయింది. సుమారు 14 మండలాల్లో సగటు వర్షపాతం కంటే తక్కువగా నమోదైయింది.

నల్లగొండ జిల్లాలో 2022 డిసెంబరులో భూగర్భజలం 4.51మీటర్లు కాగా 2023 డిసెంబరు లో 7.22 మీటర్ల లోతుకు పడిపోయింది. ఫిబ్రవరి నెలాఖరుకు మరింతగా పడిపోయింది.దీంతో గ్రామాల్లో మంచినీటికి వినియోగించే బోర్లలో నీటి లభ్యత తగ్గి తాగు నీటిఎద్దడి మొదలైంది. మూసీ, ఎస్సారెస్పీ కింద యాసంగిలో ఆన్‌అండ్‌ఆఫ్ కింద కాల్వలకు నీటి విడుదల చేయడంతో నల్లగొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాలో కొన్ని మండలాల్లో భూగర్భజలాలువృద్ధి చెందాయి. ప్రస్తుతంమంచినీటి సమస్య ప్రభావం అంతగా లేదని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

వేసవి ఎద్దడిని ఎదుర్కొనేందుకు ప్రత్యేక కారాచరణ

వేసవిలో మంచినీటి సమస్య తీవ్రరూపం దాల్చకుండా అధికార యంత్రాంగం ముందస్తు కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా ఇప్పటికే తాగు నీటి సమస్య ఎదుర్కొంటున్న గ్రామాలను గుర్తించి అవకాశం ఉన్న ప్రాంతాల్లో నూతన బోర్లు వేయడం, పాతబోర్లకు మరమ్మతులు చేయించడం, ప్రైవేట్ వ్యక్తుల బోర్ల నుంచి నీటిని కొనుగోలు చేయడం, దెబ్బతిన్న భగీరథ పైపులైన్లు మరమ్మతులు చేసి ఓవర్‌హెడ్ ట్యాంకులకు నీరు సరఫరా చేయడం, నల్లాల ద్వారా ఇళ్లకు తాగునీరు సరఫరా చేసేలా చూడాలని సమస్య జటిలంగా వున్న చోట ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేసేందుకు రెవెన్యూ, ఆర్‌డబ్ల్యూఎస్, వ్యవసాయ, తహసీల్దార్లు తదితర వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి అంచనా వ్యయాన్ని రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నెల 20లోగా అన్ని పనులను పూర్తి చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఆదేశాల మేరకు జిల్లా స్థాయిలో అధికారులు యుద్ధ ప్రాతిపదికన ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు తెలిసింది.

ఉమ్మడి జిల్లాలో రూ.17 కోట్లతో ప్రతిపాదనలు

వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ చర్యల్లో భాగంగా పనులు చేపట్టేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లా అధికారులు ప్రతిపాదనలు పంపించారు. నల్లగొండ జిల్లాలో రూ.9.17 కోట్లు, సూర్యాపేట జిల్లాలో రూ.5.7 3 కోట్లు, యాదాద్రి భువనగిరి జిల్లాలో రూ.3కోట్ల పనులకు నివేదికలు రూపొందించి ప్రభుత్వానికి పంపించారు. నల్లగొండ జిల్లాలో 1,253 బోర్లకు రూ.4.17 కోట్లు, 1,014 పంపులకు రూ.2.06 కోట్లు వ్యయమవుతున్నట్లు అధికారులు అంచనా వేశారు. ప్రధానం సూర్యాపేట జిల్లాలో నాగారం మండలం లో 2గ్రామాలు, జాజిరెడ్డిగూడెం 2, తిరుమలగిరిలో 8, హుజూర్‌నగర్ 2, గరిడేపల్లి 33, మఠంపల్లి 25, మేళ్లచెర్వు 9, చింతలపాలెం 4, నేరేడుచర్ల 1, పాలకవీడు 3, అనంతగిరి 17,చిలుకూరు 15, నడిగూడెం 6, మొత్తం 127 గ్రామాలకు ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాల్సివుంటుందని నివేదిక సిద్ధం చేసినట్లు సమాచారం.



ఎండుతున్న పొలానికి ట్యాంకర్‌తో నీళ్లు పెడుతున్న శ్రీను

వరికి ట్యాంకర్‌తో నీళ్లు

త్రిపురారం: నల్లగొండ జిల్లా త్రిపురారం మండలకేంద్రంలో వరి పంట ఎండిపోతుండటంతో ట్యాంకర్‌తో నీళ్ల పెడుతున్న దృశ్యాలు కన్నీరు పెట్టిస్తున్నాయి. రైతు నగిరి శ్రీను 4 ఎకరాలలో వరి సాగు చేయగా పంట చేతి కొచ్చే సమయంలో ఉన్న మూడుబోర్లు, బావి ఎండిపోవడంతో ఈ పరిస్థితి దాపురించింది.

నాగార్జునసాగర్: చెంతనే కృష్ణమ్మ ఉన్నా సాగర్‌వాసులకు దాహార్తి తీరడం లేదు. మూడు రోజులుగా హిల్‌కాలనీ, పైలాన్‌కాలనీలలో ఇళ్లకు తాగునీటి సరఫరా నిలిచి స్థానికులు ఇబ్బందులుపడుతున్నారు. వేసవికి ప్రారంభానికి ముందే నీటి ఎద్దడి

మూడు రోజులుగా నీటి సరఫరా బంద్

ఏర్పడితే వచ్చే నెల నుంచి ఎలా అని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఫిల్టర్‌హౌజ్ ఏఈ బిక్షమయ్యను సంప్రదించగా కాలనీలకు నీటిని సరఫరా చేసే మోటర్లు మరమ్మతులకు గురయ్యాయని, పనులు చేయడానికి మరో రెండు రోజులు పడుతుందన్నారు.

అంగడి సరుకులా మద్యం విక్రయాలు

» పట్టించుకోని ఎక్సైజ్ అధికారులు » పాలకవీడు మండలంలో 100బెల్టు షాపులు

పాలకవీడు, మార్చి 4: బుట్టల్లో కూరగాయలు, పండ్లు విక్రయించడాన్ని నిత్యం చూస్తుంటాం. ఇదే రీతిలో అంగడి సరుకులా మద్యం కూడా దొరుకుతోంది. బెల్టు షాపులను అరికట్టాలని రాష్ట్ర ప్రభుత్వం ఓ పక్క కసరత్తు చేస్తుంటే.. ఈనెల మూడో తేదీన అంగడి సరుకులా మద్యాన్ని విక్రయించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా పరిసర ప్రాంతంలోని ఓ కాలనీలో బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలకు చెందిన కాంట్రాక్టు కార్మికులు నివసిస్తున్నారు. ఆ ప్రాంతానికి చెందిన కొందరు మహిళలు అట్టపెట్టెలో మద్యం సీసాలు తీసుకువెళ్లి అక్కడి కార్మికులకు విక్రయిస్తున్నారు. క్వార్టర్ బాటిల్‌కు రూ.20లు అదనంగా తీసుకుని విక్రయిస్తున్నా, కొనుగోలు చేసేందుకు కార్మికులు పోటీ పడుతున్నారు. వైన్స్ దుకాణాల నుంచి మద్యం సీసాలు కొనుగోలు చేసి ఇక్కడి కార్మికులకు విక్రయిస్తున్నా ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదు. పాలకవీడు మండలంలో 100కు పైగా బెల్టుషాపులు ఉండగా, ప్రతి గ్రామంలో కనీసం ఐదు బెల్ట్ షాపులు ఉన్నాయి. ఈ ఘటనపై ఎక్సైజ్ ఎస్ఐ జగన్మోహన్‌రెడ్డిని వివరణ కోరగా బహిరంగ ప్రదేశాల్లో మద్యం విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



జాన్‌పహాడ్ దర్గా సమీపంలో రోడ్డుపైనే అట్టపెట్టెలో మద్యాన్ని తెచ్చి విక్రయిస్తున్న మహిళ

భూ సమస్యలపై సత్వరమే స్పందించాలి

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 4 : జిల్లాలో భూసమస్యలపై సంబంధిత అధికారులు సత్వరమే స్పందించాలని కలెక్టర్ ఎస్ వెంకటరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లతతో కలిసి నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వేసవి దృష్ట్యా గ్రామాలు, పట్టణాల్లో నీటి సమస్యలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో జాబ్‌కార్డులు ఉన్న కూలీలకు ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలని ఆదేశించారు. ప్రజాపాలన సేవా కేంద్రాల్లో దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ను వేగవంతం చేయాలన్నారు. జిల్లాలో త్వరలో జరగను న్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో స్వీప్ కార్యక్రమాలు నియోజకవర్గాల వారీగా చేపట్టాలన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో జడ్పీ సీఈవో అప్పారావు, డీఆర్‌డీవో మధుసూదనరాజు, డీఎఫ్‌వో సతీష్‌కుమార్, డీపీవో సురేష్‌కుమార్, డీఈవో శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.



ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటరావు

మెగా డీఎస్సీ విడుదల చేయాలి

సూర్యాపేట టౌన్, మార్చి 4 : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది దగాడీఎస్సీ అని వెంటనే 24వేల పోస్టులతో మెగాడీఎస్సీ వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ ఆవరణలో నిరసన తెలిపి, మాట్లాడారు. గత నోటిఫికేషన్‌కు ప్రస్తుత నోటిఫికేషన్‌కు ఎలాంటి పోస్టులు పెరగలేదని ఆవేదనవ్యక్తం చేశారు. ముఖ్యంగా డీఎస్సీ నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్ పోస్టులను పెంచాలన్నారు. సెకండరీ గ్రేడ్ టీచర్స్ పోస్టులు 11,062 ఉండగా స్కూల్ అసిస్టెంట్ మాత్రం 2,629 పోస్టులు ఉండడం దారుణమన్నారు. కార్యక్రమంలో నిరుద్యోగులు శతకోటి, పరుశరాం, సందీప్, వెంకన్న, మహేష్, శ్రీనివాస్, సైదులు, శ్రవణ్, రమాదేవి, శ్రీదేవి, మాలతీ, జానయ్య, హారిక, రాధిక, కవిత, లింగయ్య, నజీర్ పాల్గొన్నారు.

మినీ డీఎస్సీ విడుదల చేసి చేతులు దులుపుకుంది

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు మెగా డీఎస్సీ అని ప్రకటనలు చేసి అధికారంలోకి వచ్చిన తర్వాత మినీ డీఎస్సీ విడుదల చేసి చేతులు దులుపుకుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్ వీరబోయిన లింగయ్యయాదవ్ అన్నారు. సోమవారం సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 24వేల పోస్టులతో మెగా డీఎస్సీని విడుదల చేయాలన్నారు.



నిరసన తెలుపుతున్న నిరుద్యోగులు

కార్యక్రమంలో పోలోజు మహేష్, భయ్యా రాజేష్, ఉప్పుల మధుసూదన్, మేడిపల్లి వంశీ, అంజి, వీరబోయిన మహేష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

సూర్యాపేటటౌన్, మార్చి 4 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ బీఎస్ లత అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్‌ఆర్‌ఆర్ ఫంక్షన్‌హాల్‌లో పీఎం విశ్వకర్మ పథకంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చేతివృత్తులను, కులవృత్తులను కాపాడేలా ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలను తీసుకువస్తుందన్నారు. పీఎం విశ్వకర్మ పథకంతో శిక్షణ కార్యక్రమాలు, ఆర్థిక అభివృద్ధికి రుణాలు అందజేస్తుందన్నారు. ప్రతీ గ్రామంలో ఈ పథకానికి సంబంధించిన వివరాలు గ్రామకార్యదర్శి వద్ద ఉంటాయని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధికారులు, బ్యాంకు ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ బీఎస్ లత

యాదగిరిక్షేత్రంలో నేటి నుంచి
శివరాత్రి మహోత్సవాలు



శివరాత్రి ఉత్సవాలకు వచ్చే భక్తుల కోసం ఏర్పాటుచేసిన చలువ పందిళ్లు

యాదగిరిగుట్ట, మార్చి 4: యాదగిరికొండపైన అనుబంధ దేవాలయమైన రామలింగేశ్వరస్వామి సన్నిధిలో మంగళవారం నుంచి ఈ నెల 10వ తేదీ వరకు శైవాగమ పద్ధతిలో శివరాత్రి మహోత్సవాలు కొనసాగనున్నాయి. శివాలయ ఉద్ఘాటన అనంతరం రెండోసారి ఉత్సవాలు కొనసాగనుండడంతో దేవస్థాన అధికారులు ముందస్తుగానే ఏర్పాట్లు పూర్తిచేశారు. మంగళవారం ఉదయం 10.30 గంటలకు విఘ్నేశ్వరుడికి తొలి పూజలతో స్వస్తిపుణ్యావాచనంతో ఉత్సవాలకు శ్రీకారం పలకనున్నారు. ఈ నెల 7వ తేదీ రాత్రికి శివాలయ కల్యాణమండపంలో కొనసాగే శివకల్యాణోత్సవంలో పాల్గొనే భక్తులకు రూ.516 టిక్కెట్, 8న మహాశివరాత్రి రోజున ఉదయం నుంచి రాత్రి వరకు కొనసాగే అభిషేక పూజలకు రూ.300 టికెట్, రాత్రి మహాన్యాసపూర్వక శత రుద్రాభిషేకంలో పాల్గొనేందుకు రూ.516, 9వ తేదీన ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు లక్షబిల్వార్చన పూజల్లో రూ.516 టికెట్‌గా నిర్ణయించారు. ప్రతీ సేవలోనూ ఇద్దరు భక్తులు మాత్రమే పాల్గొనాలని అధికారులు తెలిపారు. 10వ తేదీ మధ్యాహ్నం యాగశాలలో మహాపూర్ణాహుతితో శివరాత్రి మహోత్సవాలు పరిసమాప్తమవుతాయి.

హరిహరులకు విశేష పూజలు

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో సోమవారం హరిహరులకు విశేష పూజలు సంప్రదాయరీతిలో కొనసాగాయి. కొండగుహలోని స్వయంభూ లక్ష్మీనారసింహుడికి పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో.. అనుబంధ శివాలయంలోని రామలింగేశ్వరుడికి, స్ఫటిక మూర్తులకు శైవాగమ పద్ధతిలో నిత్యవిధి కైంకర్యాలు నిర్వహించారు. అష్టభుజి ప్రాకార మండపంలో నిత్య తిరుకల్యాణోత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.21,33,980ల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు. స్వామివారిని ప్రముఖ గాయకుడు ఎస్పీ చరణ్ దర్శించుకున్నారు.

అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్

» అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): అర్చక, ఉద్యోగులకు ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించేందుకు అర్చక వెల్ఫేర్ బోర్డు తీర్మానం చేసింది. బోర్డు ఛైర్మన్ నవీన్ మిట్టల్, దేవాదాయశాఖ కమిషనర్ అనిల్ కుమార్, విశ్రాంత హైకోర్టు జడ్జి వామన్‌రావు ఇతర అధికారులు సచివాలయంలో సోమవారం సమావేశమై పలు కీలక అంశాలపై చర్చించారు. అర్చక, ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలు ఈ సమావేశంలో కొలిక్కి వచ్చాయి. ప్రధానంగా, దేవాదాయశాఖ పరిధిలో విధులు నిర్వహిస్తూ గ్రాంట్ ఇన్ ఎయిడ్ పద్దులో వేతనాలు పొందుతున్న అర్చక, ఉద్యోగులకు హెల్త్ ఇన్సూరెన్స్ కల్పించాలని తీర్మానం చేశారు. అయితే, ఒకేసారి అందరికి కాకుండా దశల వారిగా అమలు చేయాలనే నిర్ణయానికి వచ్చారు. మొదటి విడతలో రూ.50 వేలలోపు వేతనం ఉన్నవారికి, అనంతరం పలు దఫాల్లో మిగతా వారికి హెల్త్ ఇన్సురెన్స్ కల్పించనున్నారు. ఇందుకోసం అన్ని జిల్లాల నుంచి అర్చక, ఉద్యోగుల సమాచార సేకరణ ప్రక్రియ తక్షణం ప్రారంభించాలని దేవాదాయశాఖ అధికారుల్ని కోరారు.

బీఆర్ఎస్‌కు భవిష్యత్తు లేదు: కిషన్ రెడ్డి

ఆదిలాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీకి అసలు భవిష్యత్తే లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. ఆదిలాబాద్ అంటేనే ఆదివాసీల గడ్డాగా పేరుందని, ఈ ప్రాంతంలో కొమురంభీం, రాంజీ గోండు స్ఫూర్తిగా ఎన్నో పోరాటాలు జరిగాయని గుర్తు చేశారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. దేశ ప్రజల ఆశీస్సులతో మూడోసారి నరేంద్ర మోదీ ప్రధాని కావడం ఖాయమన్నారు. అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌కు కూడా భవిష్యత్ లేదని ఆయన అన్నారు.

గతేడాది యాసంగి సీఎంఆర్ గడువు పెంపు

» మే 15 తేదీ వరకు అవకాశం కల్పించిన కేంద్రం

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): గతేడాది(2022- 23) యాసంగి సీజన్‌కు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీ గడువును రానున్న మే నెల 15 తేదీ వరకు పెంచుతూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. సీఎంఆర్ గడువు పెంచాలని గత ఫిబ్రవరి నెల 23 తేదీన రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి రాసిన లేఖను పరిగణనలోకి తీసుకొని ఈ ఉత్తర్వులు ఇచ్చింది. బియ్యం రీసైక్లింగ్ చేయకుండా చర్యలు తీసుకోవాలని, మిల్లుల వారీగా లిఖితపూర్వకంగా షెడ్యూలు తీసుకొని, ఎఫ్‌సీఐకి డెలివరీ చేేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఎఫ్‌సీఐ క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేయాలని, డెలివరీ సమయంలో బియ్యాన్ని పరీక్షించి తీసుకోవాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్.. వివిధ జిల్లాల మేనేజర్లు, డీఎస్‌వోలకు సోమవారం సర్క్యులర్ జారీచేశారు. యాసంగి సీజన్‌కు సంబంధించిన ధాన్యంలో ఇటీవల టెండర్లు పిలిచిన 35 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మినహాయించి.. మిల్లింగ్ ప్రక్రియ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

5-6 నెలల తర్వాత..

ఈ సర్కారుండదు

(మొదటి పేజీ తరువాయి)

నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలతో ఆయన సమావేశమయ్యారు. పార్టీ నేతలతో పలు అంశాలపై చర్చించారు. సిటింగ్ ఎంపీలు నామా నాగేశ్వరరావుకు ఖమ్మం, మహబూబాబాద్‌లో మాలోతు కవితకు మరోసారి పోటీకి అవకాశం ఇవ్వాలని ఈ భేటీలో ఏకగ్రీవంగా తీర్మానించారు. అదేవిధంగా ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల ఎన్నికల ఇన్‌చార్జులుగా పల్లా రాజేశ్వర్ రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డిని నిర్ణయించారు. ఈ సందర్భంగా కేసీఆర్ మాట్లాడుతూ.. కొద్దిరోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని, వారిపై ఉండే వ్యతిరేకతను బీఆర్ఎస్‌కు అనుకూలంగా మార్చుకుని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేద్దామని పార్టీ శ్రేణులతో అన్నారు. బీఆర్ఎస్‌ను వీడుతున్న వారివల్ల పార్టీకి ఎటువంటి నష్టం ఉండబోదని.. అలాంటి పరిణామాలను చూసి ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. 12న కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించిన అనంతరం.. ఖమ్మంలోనూ బహిరంగ సభ చేపడతామని తెలిపారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పార్టీ ఓడిపోయినా.. అధైర్యపడాల్సిన పనిలేదని, నాయకులు ధైర్యంతో ముందడుగు వేయాలని సలహా ఇచ్చారు. పార్టీని పటిష్ఠం చేసుకోవడంలో భాగంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికీ ముగ్గురితో సమన్వయ కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. "బీఆర్ఎస్ పాలనలో సాగునీరు, తాగునీరు, విద్యుత్‌ను సమృద్ధిగా అందించడంతోపాటు సంక్షేమ, అభివృద్ధి పథకాల అమలుతో ప్రజలకు చేయాల్సింది చేశాం. అయినప్పటికీ.. వారు మనకు ప్రతిపక్ష పాత్ర ఇచ్చారు. మన విలువ ప్రజలకు తొందరలోనే తెలుస్తుంది" అన్నారు. రాష్ట్రంలో రైతు బంధు, దళితబంధు వంటి పథకాలు ఎన్నికల కోసం తేలేదని, ఒక విజన్‌తో తెచ్చానని కేసీఆర్ చెప్పారు.



తెలంగాణ భవన్‌లో పార్టీ నేతలతో మాట్లాడుతున్న కేసీఆర్

ఎన్టీఆర్‌లాంటి నేతకే తప్పలేదు..

"రాజకీయాల్లో గెలుపోటములు సహజమే. ఎన్టీఆర్ లాంటి నేతకే ఒడుదొడుకులు తప్పలేదు.. ఆయన ముందు మనమెంత?" అని కేసీఆర్ ఈ భేటీలో వ్యాఖ్యానించినట్లు తెలిసింది. ఉమ్మడి రాష్ట్రంలో పాతాళానికి పడిపోయి కూడా మళ్లీ అధికారంలోకి వచ్చిన టీడీపీని చూసి నేర్చుకోవాల్సింది చాలా ఉందని పేర్కొన్నారు. "అప్పట్లో టీడీపీ మన పార్టీ కంటే దారుణంగా ఓటమి చవిచూసింది. అయినప్పటికీ.. తప్పులను సరిదిద్దుకొని తిరిగి చేజిక్కించుకుంది" అని పార్టీ శ్రేణులకు గుర్తుచేశారు. "అసెంబ్లీ ఎన్నికల్లో మనం ఓడిపోవడం కూడా మంచిదే.. గుర్రం ఏదో.. గాడిదేదో తెలుసుకునే అవకాశం రాష్ట్ర ప్రజలకు వచ్చింది"ని కేసీఆర్ వ్యాఖ్యానించారు. కాగా.. ఈ సమీక్షా సమావేశానికి భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు హాజరు కాలేదు. వెంకటరావు కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోవడం లాంఛనమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

నలుగురు అభ్యర్థుల పేర్లు ఖరారు

రెండు రోజుల సమీక్షల అనంతరం కేసీఆర్ తమ పార్టీ తరఫున లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసే నలుగురు అభ్యర్థుల పేర్లు ప్రకటించారు. కరీంనగర్ నుంచి బోయినపల్లి వినోద్‌కుమార్, పెద్దపల్లి నుంచి కొప్పుల ఈశ్వర్, ఖమ్మం నుంచి నామా నాగేశ్వరరావు, మహబూబాబాద్ నుంచి మాలోతు కవిత పోటీ చేస్తారని ఆయన వెల్లడించారు.

కాంగ్రెస్ మోసపూరిత వైఖరిని ప్రజలకు చెప్పండి: హరీశ్

అధికారంలోకి వచ్చి 3 నెలలు కావస్తున్నా ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని.. అసంపూర్తిగా అమలుచేసిన రెండు, మూడు హామీల చూపించి అన్నీ చేసినట్లు ప్రచారం చేసుకుంటోందని.. రాష్ట్రంలో ఆ పార్టీ అనుసరిస్తున్న మోసపూరిత వైఖరిని క్షేత్రస్థాయిలో ప్రజలకు వివరించి చెప్పాలని పార్టీ నేతలతో మాజీ మంత్రి టి.హరీశ్‌రావు పేర్కొన్నారు. ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల నేతలతో కేసీఆర్ సమీక్ష అనంతరం తెలంగాణ భవన్‌లో ఆ రెండు నియోజకవర్గాల అభ్యర్థులు, ముఖ్యనేతలతో హరీశ్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ మోసాలపై ఎక్కడికక్కడ నిలదీయాలని, ప్రజల్లో చర్చ జరిగేలా చూడాలని సూచించారు. గల్లీలో కాంగ్రెస్ ఉన్నా, తెలంగాణ సమస్యలు ఢిల్లీ వేదికగా ప్రశ్నించేందుకు, పరిష్కరించేందుకు బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులు గెలవాలన్నారు. కాగా.. ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి రాహుల్ గాంధీనే కాక ఎవరు పోటీ చేసినా ఎదుర్కొంటామని.. ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు స్పష్టం చేశారు. పార్లమెంటు ఎన్నికల్లో తెలంగాణ ప్రజలు బీఆర్ఎస్ వైపే ఉంటారన్నారు.



సిరిసిల్ల జిల్లా నారాయణపూర్‌లో జరిగే రేణుకామాత జమదగ్ని కల్యాణానికి రావాల్సిందిగా కేటీఆర్‌కు ఆహ్వాన పత్రిక అందిస్తున్న గౌడ సంఘం నేతలు

ఎల్ఆర్ఎస్‌పై
బీఆర్ఎస్ పోరుబాట

» 6న నియోజకవర్గాల కేంద్రాల్లో ధర్నాలు

» 7న కలెక్టర్లు, ఆర్డీవోలకు వినతిపత్రాలు: కేటీఆర్

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ (లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)పై తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బీఆర్ఎస్ పోరు బాటకు సిద్ధమవుతున్నట్లు ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రకటించారు. సోమవారం తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రులు సి.లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎటువంటి ఫీజు వసూలు చేయకుండా ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అనుమతులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇందుకుగాను తమపార్టీ ఆధ్వర్యంలో ఈనెల 6న అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో, హైదరాబాద్‌లోని జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ కార్యాలయాలవద్ద ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎల్ఆర్ఎస్ బాధితులను కలుపుకొని ఈ ధర్నాలు విజయవంతం చేయాలని బీఆర్ఎస్ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా 33 జిల్లాల పరిధిలో ఈనెల 7న జిల్లా కలెక్టర్లు, ఆర్డీవోలను కలిసి వినతిపత్రాలు సమర్పించాలని నిర్ణయించినట్లు కేటీఆర్ పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఎల్ఆర్ఎస్ ఫీజులు చెల్లించాలని చెబితే రక్తమాంసాలు పీలుస్తున్నామని నాడు విమర్శించారన్నారు. గతంలో తాము ఎల్ఆర్ఎస్ తెస్తే కోమటిరెడ్డి వెంకటరెడ్డి కోర్టుకు వెళ్లారని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎల్ఆర్ఎస్‌ను రద్దుచేస్తామని గతంలో భట్టివిక్రమార్క చెప్పారని, నో ఎల్ఆర్ఎస్.. నో టీఆర్ఎస్ అని వ్యాఖ్యానించారని గుర్తు చేశారు. అదేవిధంగా ఉచితంగా భూములను క్రమబద్ధీకరిస్తామని ఉత్తమ్ చెప్పారని, జనం సొమ్ము దోచుకోవడానికి ఎల్ఆర్ఎస్ తెచ్చారని సీతక్క కూడా అన్నారని పేర్కొన్నారు. ప్రజలపై ఆర్థికభారం మోపడానికి రంగం సిద్ధం చేశారని, రాష్ట్ర ప్రజల ద్వారా రూ.20వేల కోట్లు రాబట్టాలని కాంగ్రెస్ ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆరోపించారు.

ఉమ్మడి పాలమూరు నేతలతో కేటీఆర్ భేటీ

త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నిక, లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి పార్టీ కార్యాచరణపై ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నేతలతో కేటీఆర్ సమావేశమయ్యారు. తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన ఈ సమావేశంలో మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎమ్మెల్సీ నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పేరును ప్రస్తావించినట్లు తెలుస్తోంది. పార్టీ అధినేత దృష్టికి తీసుకువెళ్లి.. ఆయన పేరును ఖరారు చేయనున్నట్లు సమాచారం.

బయట పడిన చీకటి ఒప్పందం

» సభలో బీజేపీ, కాంగ్రెస్‌ల నైజం వెల్లడి

» చెవిలో పూలు పెట్టిన మోదీ, రేవంత్

» లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి కాంగ్రెస్ సాయం: ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ, కాంగ్రెస్ పార్టీల మధ్య ఉన్న చీకటి ఒప్పందం మరోసారి బయట పడిందని, ఆదిలాబాద్ సభలో ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం రేవంత్‌రెడ్డి అలై బలై తీసుకున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మోదీ వద్ద మోకరిల్లడాన్ని.. యావత్ తెలంగాణ చూసిందని, వారిద్దరి మధ్య ఉండే బడే భాయ్.. చోటే భాయ్ బంధం ప్రజల ముందే బహిర్గతమైందన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో సోమవారం మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల కోసం కాంగ్రెస్, బీజేపీల మధ్య అవగాహన కుదిరిందని, ఉత్తర తెలంగాణలో బీజేపీకి కాంగ్రెస్ సహాయం చేస్తుందని ఆయన జోస్యం చెప్పారు. తెలంగాణ ప్రజల చెవిలో రేవంత్‌రెడ్డి కాలీఫ్లవర్ పెడితే.. మోదీ కమలం పువ్వు పెట్టారని ఆయన ఎద్దేవా చేశారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎఫ్ఆర్‌బీఎం పరిమితి దాటి రుణం అడిగితే.. కేంద్రం ఇబ్బంది పెట్టిందని.. అదే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తీసుకోవడానికి ఎలా అనుమతించారని ప్రశ్నించారు. ప్రధాని మోదీని సీఎం రేవంత్ ఒక్క మాట కూడా అనరని, మాజీ సీఎం కేసీఆర్‌పై మాత్రం ఒంటికాలితో లేస్తారని ధ్వజమెత్తారు. ప్రధాని మోదీ.. అదానీ బంధంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు చేస్తుంటే.. రేవంత్ మాత్రం అదానీతో ఒప్పందం చేసుకుంటున్నారని, ఈ ఇద్దరు కాంగ్రెస్ నేతల్లో ఎవరిని నమ్మాలని పల్లా రాజేశ్వర్ రెడ్డి నిలదీశారు.

ఓఆర్ఆర్ లీజు బేస్ ప్రైస్
రూ.7300 కోట్లు!

(మొదటి పేజీ తరువాయి)

అప్పగించడంపై నిరుడు ఏప్రిల్ 28న 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో.. 'రాసిచ్చేశారు' అనే శీర్షికతో ప్రచురించిన కథనం రాష్ట్ర రాజకీయాల్లో దుమారం సృష్టించింది. తాము అధికారంలోకి వచ్చాక దీనిపై విచారణ జరిపిస్తామని టీపీసీసీ చీఫ్‌గా రేవంత్ రెడ్డి అప్పట్లో ప్రకటించారు. సీఎం కాగానే దీనిపై హెచ్ఎండీఏ అధికారుల నుంచి పూర్తిస్థాయి నివేదిక కోరారు. టెండర్లు ఆహ్వానించినప్పుడు బేస్‌ప్రైస్‌ను ప్రభుత్వం ప్రకటించక పోయినప్పటికీ.. టెండర్ వేసిన నాలుగు సంస్థల్లో ఐఆర్‌బీ సంస్థ రూ.7272 కోట్లు, దినేష్‌చంద్ర ఆర్ అగర్వాల్ ఇన్‌ఫ్రా రూ.7007 కోట్లు, గవర్ కన్‌స్ట్రక్షన్ రూ.6767 కోట్లు, ప్రస్తుతం టోల్ వసూలు చేస్తున్న ఈగల్ ఇన్‌ఫ్రా రూ.5643 కోట్ల మేర బిడ్‌లను కోట్ చేశాయి. అత్యధికంగా కోట్ చేసిన ఐఆర్‌బీ సంస్థను.. 'మరింత అధికంగా చెల్లిస్తారా?' అని ప్రభుత్వ వర్గాలు కోరగా రూ.7380 కోట్లు చెల్లించేందుకు ఆ సంస్థ ముందుకొచ్చినట్లు అధికారులు ప్రకటించారు. ఓఆర్ఆర్‌పై ఏటా పెరిగే వాహనాలు, 3 నుంచి 4 శాతం మేర పెరిగే టోల్ చార్జీలతో ఏడాదికి కనీసం ఐదు శాతం ఆదాయం పెరిగినా సర్కారుకు భారీగా ఆదాయం పెరుగుతుంది. అయినా.. 30 ఏళ్ల లీజుకు బేస్‌ప్రైస్‌ను రూ.7300 కోట్లుగా నిర్ణయించడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. ఓఆర్ఆర్ టీవోటీ ఫైనాన్షియల్ బిడ్‌ల ఇనిషియల్ ఎస్టిమేటెడ్ కన్సెషన్ వాల్యూను (ఐఈసీవీ) నిర్ధారించడానికి అప్పట్లో ఏర్పాటు చేసిన ఐఏఎస్ అధికారుల కమిటీయే రూ.7380 కోట్ల లీజు చెల్లించడానికి ఐఆర్‌బీ సంస్థను ఒప్పించినట్లు తెలిసింది. ఈ మేరకు.. గత ఏడాది ఆగస్టు 12 అర్ధరాత్రి నుంచి ఓఆర్ఆర్ ప్రైవేటు సంస్థ లీజులోకి వెళ్లగా, 11వ తేదీనే ప్రభుత్వానికి రూ.7380 కోట్ల చెక్కు అందింది. దాన్ని హెచ్ఎండీఏ ఖాతాలో 12న జమ చేయగా, మరుసటి రోజే రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆ సొమ్మును రాష్ట్ర ఖజానాకు మళ్లించారు. ఆ మొత్తాన్ని హైదరాబాద్ మహా నగర అభివృద్ధికి, మౌలిక సదుపాయాల కల్పనకు వాడతామని.. అప్పటి సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ప్రకటించారు. కానీ, ఆ సొమ్మును రైతు రుణమాఫీకి వినియోగించినట్లు సమాచారం.

రహదారులు రక్తసిక్తం!

» రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం

కొత్తకోట, సదాశివపేట, పటాన్ చెరు, బోయినపల్లి, మార్చి 4: రాష్ట్రంలో రహదారులు రక్తసిక్తమయ్యాయి! వేర్వేరు జిల్లాల్లో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 11 మంది దుర్మరణం చెందారు. నిశ్చితార్థానికి వెళ్తున్న కుటుంబసభ్యుల కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో అందులోని వారిలో ఐదుగురు దుర్మరణం చెందారు. మరో ఐదుగురు తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘటన సోమవారం వనపర్తి జిల్లా కొత్తకోట మండలంలో చోటుచేసుకుంది. కర్ణాటక రాష్ట్రంలోని బళ్లారి పట్టణం బసవన్నకుంటకు చెందిన సలీమాబీ మనవడు అలీకి హైదరాబాద్‌లోని ఓ కుటుంబంతో పెళ్లి సంబంధం ఖాయమైంది. సోమవారం హైదరాబాద్‌లో నిశ్చితార్థం ఉన్నందున సలీమా బీ కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం రాత్రి ఎర్టిగా కారులో బళ్లారి నుంచి బయలుదేరారు. అలీ డ్రైవింగ్ చేస్తున్నాడు. సోమవారం తెల్లవారుజామున 3 గంటల ప్రాంతంలో కొత్తకోట సమీపంలోని బైపాస్ రోడ్డులో వారి కారు జాతీయ రహదారి పక్కనున్న చెట్టును ఢీకొంది. కారు ముందుభాగం నుజ్జునుజ్జయింది. దీంతో ఘటనా స్థలంలోనే అబ్దుల్ రెహమాన్ (39), రుమానా (2), సలీమా బీ (95), రోషిణి (4), హసిఫా రిఫాత్ (7 నెలలు) మృతి చెందారు. అలీ, షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. తర్వాత షఫీ, హసన్, ఖదీర్, అబీబ్‌లను మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై మంజునాథ్‌రెడ్డి తెలిపారు. అతివేగం, నిద్రమత్తు ప్రమాదానికి కారణంగా తెలుస్తోందన్నారు. ఈ ప్రమాదంలో చిన్నదెబ్బ కూడా తగలకుండా సమీరా (8) బయటపడింది.

ఇదిలా ఉండగా.. బంధువు అంత్యక్రియలకు వెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులిద్దరూ దుర్మరణంపాలైన ఘటన కామారెడ్డి జిల్లాలో సోమవారం చోటుచేసుకుంది. సదాశివనగర్‌కు చెందిన దంపతులు ఏనుగు జనార్దన్ రెడ్డి(49), ఏనుగు ప్రతిభ (42) మండలంలోని పద్మాజీవాడి గ్రామంలో తమ బంధువు మృతి చెందడంతో అంత్యక్రియలకు స్కూటీపై బయలుదేరారు. పద్మాజీవాడి వద్ద గుర్తుతెలియని వాహనం వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టడంతో స్కూటీపై నుంచి వారిద్దరూ కింద పడ్డారు. ప్రతిభపై నుంచి వాహనం వెళ్లడంతో ఆమె శరీరం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే మృతి చెందింది. జనార్దన్ కాలుపై నుంచి కూడా వాహనం వెళ్లడంతో కాలు తెగి రోడ్డుకే అతుక్కుపోయింది. అతన్ని వెంటనే హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించిన కొద్దిసేపటికే మృతి చెందాడు. కాగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఐనోల్ గ్రామ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో బిహార్‌కు చెందిన సూరజ్(34), ఉత్తరప్రదేశ్‌కు చెందిన ధర్మేందర్(30) అనే భవన నిర్మాణ కార్మికులు మృతి చెందారు. ఆదివారం రాత్రి పల్సర్ బైక్‌పై పటాన్‌చెరు నుంచి ఐనోల్ మీదుగా కంజర్ల గ్రామం వైపు వెళ్తుండగా గుర్తు తెలియని కారు ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. ఇదిలా ఉండగా..రోడ్డు పక్కన పార్క్ చేసివున్న బొలేరో వాహనాన్ని షేక్ మహ్మద్ హుస్సేన్ (14) అనే విద్యార్థి నడుపుతున్న ద్విచక్రవాహనం ఢీకొట్టింది. శనివారం జరిగిన ఘటనలో అతను చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందగా వెనుక కూర్చున్న మరో విద్యార్థికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన సికింద్రాబాద్‌లోని బోయినపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది.



వనపర్తి జిల్లా ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

ఔటర్‌పై కారు ఢీకొని..
ఆర్మీ జవాన్ దుర్మరణం

నార్సింగ్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్ రోడ్డు దాటుతుండగా గచ్చిబౌలి నుంచి ఎయిర్‌పోర్టు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ఆర్మీ జవాను మృతిచెందాడు. నార్సింగ్ వద్ద సోమవారం ఈ ఘటన జరిగింది. ప్రమాదం అనంతరం వాహనం ఆగకుండా వెళ్లిపోయింది. మృతుడు గోల్కొండ ఆర్టిలరీ సెంటర్‌లో ఆర్మీ జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారని, ఆయన పేరు కులాన్ అని నిర్ధారించారు. మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించారు. అయితే కులాన్‌ను ఓ రెడీ మిక్సర్ వాహనం ఢీకొట్టినట్లు సమాచారం. ఘటన తర్వాత కులాన్ మృతదేహం చాలా సేపటి దాకా అక్కడే ఉందని, వాహనదారుల్లో ఎవ్వరూ పట్టించుకోలేదని ఓ పోలీసు అధికారి వెల్లడించారు. మరి.. కులాన్ ఔటర్ రింగ్ రోడ్డువైపుకు ఎందుకు ఎక్కాడు? ఎక్కడికి వెళుతున్నాడు? అనే వివరాలపై పోలీసులు ఆరా తీస్తున్నారు. పాదచారులకు ఔటర్ రింగ్ రోడ్డుపైకి ప్రవేశం ఉండదు. కొంతమంది ఎయిర్ పోర్టుకు గానీ, గచ్చిబౌలికి గానీ వెళ్లాలన్నా ఔటర్ రింగ్‌రోడ్డుపైకి ఎక్కి షేరింగ్ ట్యాక్సీలను ఆపి ఎక్కడం లేదా లిఫ్ట్ అడిగి ఎక్కడం చేస్తుంటారు. ఆ రకంగా ఇతను ఎక్కడకైనా వెళ్లేందుకు వచ్చాడా? అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కాళేశ్వరం అక్రమాలపై న్యాయవిచారణ

» కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్ సెక్షన్3(1) ప్రకారం ఆదేశిస్తాం

» సుప్రీంకోర్టు లేదా హైకోర్టు మాజీ న్యాయమూర్తితో ఎంక్వైరీ

» మా విజ్ఞప్తి మేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్‌ఏ కమిటీ

» హైకోర్టుకు లిఖితపూర్వకంగా నివేదించిన రాష్ట్ర ప్రభుత్వం

» కాంగ్రెస్ నేత నిరంజన్ పిటిషన్ నాలుగు నెలలకు వాయిదా

హైదరాబాద్, మార్చి 4 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అక్రమాలపై న్యాయవిచారణ జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు లిఖిత పూర్వకంగా తెలిపింది. కమిషన్ ఆఫ్ ఎంక్వైరీ యాక్ట్-1952 సెక్షన్ 3 (1) అధికారాలను ఉపయోగించుకుని విచారణకు ఆదేశిస్తామని నివేదించింది. కాళేశ్వరం అక్రమాలపై సీబీఐ విచారణ చేపట్టాలని కోరుతూ కాంగ్రెస్ నేత జి.నిరంజన్ దాఖలు చేసిన పిటిషన్‌పై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం మరోమారు విచారణ చేపట్టింది. దీనిపై ఏ నిర్ణయం తీసుకున్నారో తెలియజేయాలన్న హైకోర్టు గత ఆదేశాల మేరకు.. అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్ రెడ్డి ప్రభుత్వ వాదనను ధర్మాసనానికి తెలియజేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పలు అక్రమాలు జరిగినట్లు ప్రభుత్వం దృష్టికి వచ్చిందని ఆయన తెలిపారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నిరుడు అక్టోబర్ 24, 25 తేదీల్లో ప్రాజెక్టును సందర్శించి.. ప్రాథమిక విచారణ చేపట్టిందని.. మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటుకు కారణాలు వివరిస్తూ గత నవంబర్ 1న ప్రభుత్వానికి లేఖ రాసిందని తెలిపారు. దీనిపై పూర్తిస్థాయి దర్యాప్తు అవసరమని అథారిటీ తన లేఖలో సూచించిందని ఏజీ పేర్కొన్నారు. "డ్యామ్ సేఫ్టీ అథారిటీ లేఖ నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తునకు ఆదేశించింది. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం ప్రాథమిక దర్యాప్తును పూర్తిచేసి రాష్ట్ర ప్రభుత్వానికి నివేదికను సమర్పించింది. సదరు ప్రాథమిక నివేదిక ఆధారంగా ప్రభుత్వం పలుచర్యలు తీసుకుంది. ఈఎన్సీ (ఐ) రామగుండం ఎన్.వెంకటేశ్వర్లు సర్వీసును టెర్మినేట్ చేశాం. దాంతోపాటు ఈఎన్సీ (జనరల్)ని రాజీనామా చేయాల్సిందిగా కోరాం. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ తుది నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులైన అధికారులపై పూర్తిస్థాయిలో చర్యలు తీసుకుంటాం." అని వివరించారు. అలాగే.. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లను పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలంటూ ఫిబ్రవరి 13న రాష్ట్ర ప్రభుత్వం ఎన్‌డీఎస్ఏకి లేఖ రాసిందని.. ఈమేరకు ఆరుగురు సభ్యులతో ఎన్‌డీఎస్ఏ ఒక కమిటీని ఏర్పాటు చేస్తూ మార్చి 1న ఆదేశాలిచ్చిందని వెల్లడించారు. బరాజ్‌ల దుస్థితికి కారణాలు.. పునరుద్ధరణకు తీసుకోవాల్సిన చర్యలను కమిటీ సిఫారసు చేయనుందని చెప్పారు. ప్రభుత్వ వాదనలు నమోదు చేసుకున్న ధర్మాసనం.. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న చర్యల నేపథ్యంలో విచారణను నాలుగు నెలలకు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించింది.

110బీటీ రోడ్లకు రూ.237కోట్లతో ప్రతిపాదనలు

ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి

మోతె, మార్చి 4: కోదాడ నియోజకవర్గంలో 110 కొత్త బీటీ రోడ్ల నిర్మాణానికి రూ.237కోటతో ప్రతిపాదనలు పంపుతున్నట్లు ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి మాట్లాడారు. కోదాడ నియోజకవర్గంలో డబుల్‌లైన్ రోడ్లు, సింగిల్‌లైన్ లైన్ రోడ్ల నిర్మాణాలు, మరమ్మతులు కోసం రూ.76 కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. ఏడు ప్రాంతాల్లో హైలెవల్ బ్రిడ్జీల నిర్మాణానికి రూ.36కోట్లతో ప్రతిపాదనలు చేశామన్నారు. 48బీటీ రోడ్ల పునర్నిర్మాణానికి రూ.72కోట్లు ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలన్నారు. దరఖాస్తుదారులతో మాట్లాడారు. ఫిర్యాదులను అధికారులు సత్వరమే పరిష్కరించాలన్నారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆరు గ్యారెంటీ పథకాలకు అర్హులు ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోవచ్చని అన్నారు. గ్రామాల్లోని సమస్యలనుప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా సహకరించాలన్నారు. మండల కార్యక్రమంలో తహసీల్దార్ సంఘమిత్ర, ఇన్‌చార్జి ఎంపీడీవో హరిసింగ్‌నాయక్, సూపరింటెండెంట్ వెంకటాచారి, ఎంపీపీ ముప్పాని ఆశ, జడ్పీటీసీ పందిళ్లపల్లి పుల్లారావు, కీసర సంతోష్‌రెడ్డి, ముదిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, సామ వెంకట్‌రెడ్డి, యానాల సుదర్శన్‌రెడ్డి వివిధ గ్రామాల నాయకులు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రజాపాలన హెల్ప్‌డెస్క్‌లో 80దరఖాస్తుల స్వీకరణ

చిలుకూరు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన హెల్ప్‌డెస్క్‌లో తహసీల్దార్ ధ్రువకుమార్, ఎంపీడీవో గిరిబాబు సోమవారం 80 దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్యాస్ సబ్సిడీ, జీరో విద్యుత్ బిల్లు రానివారు ప్రజాపాలన హెల్ప్ డెస్క్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ ప్రతాప్‌సింగ్, సీనియర్ అసిస్టెంట్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన కేంద్ర ద్వారా మహిలక్ష్మి, గృహజ్యోతి దరఖాస్తులను ఎంపీడీవో డి.సోమసుందర్ రెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న ఆరు గ్యారెంటీల పథకాలకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో విజయకుమారి, పర్యవేక్షకురాలు ఆర్.విజయనిర్మల, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్‌కుమార్, పంచాయతీ ఆపరేటర్ సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.



మోతె మండల పరిషత్ కార్యాలయంలో ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఉత్తమ్‌పద్మావతిరెడ్డి

రోడ్ల వెంట మద్యం విక్రయిస్తున్న మహిళల అరెస్టు



మద్యాన్ని విక్రయిస్తున్న మహిళలను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ అధికారులు

హుజూర్‌నగర్, మార్చి 4: రోడ్డు వెంట మద్యం విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను ఎక్సైజ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. ఎక్సైజ్ ఇన్ స్పెక్టర్ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. పాలకవీడు మండలం లోని జాన్‌పహాడ్ దర్గా సమీపంలోని ఓ కాలనీలో ఆదివారం రోడ్డుపై మద్యం విక్రయిస్తున్న సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఆ ఇద్దరు మహిళల వివరాలను ఎక్సైజ్ పోలీసులు సేకరించి తనిఖీలు చేసి, వారి నుంచి 12బీరు బాటిళ్లు, 40 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఇద్దరినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాగార్జునరెడ్డి మాట్లాడుతూ రోడ్ల వెంట మద్యాన్ని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తుతెలియని కారు ఢీకొట్టడంతో లేగదూడ మృతి

మోతె, మార్చి 4: గుర్తుతెలియని కారు కొట్టడంతో లేగదూడ అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటన సూర్యాపేట-ఖమ్మం రహదారిపై రాఘవాపురం గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రాఘవాపురం క్రాస్‌రోడ్ వద్ద ఉన్న దుశర్ల సత్యనారాయణకు చెందిన అడవిలో ఉన్న పశువుల్లో రెండు (ఆవు, లేగ కోడె దూడ) చుట్టగుంట చెరువు నుంచి రోడ్డు దాటుతుండగా సూర్యాపేట నుంచి ఖమ్మం వైపు వేగంగా వెళుతున్న కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందింది. ఈ కోడె దూడను సిరికొండ గ్రామానికి ఆంబోతుగా పంపి ఉత్సవాలు నిర్వహించుదామనుకున్నామని, ఈ సమయంలో కోడె దూడ మృతి చెందడం బాధాకరమని దుశర్ల సత్యనారాయణ అన్నారు. ఈ విషయమై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో 28మందికి జరిమానా

హుజూర్‌నగర్, మార్చి 4: డ్రంకెన్ డ్రైవ్ చేసిన 28మందికి హుజూర్‌నగర్ జూనియర్ సివిల్ జడ్జి మారుతిప్రసాద్ జరిమానా విధించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డ్రంకెన్ డ్రైవ్ చేస్తూ నేరేడుచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో 14మంది, చింతలపాలెం మండలంలో ఇద్దరు, గరిడేపల్లి మండలంలో ఇద్దరు, హుజూర్‌నగర్ మండలంలో ఐదుగురు, మేళ్లచెర్వు మండలంలో ఐదుగురు పట్టుబడ్డారు. నిందితులపై పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా నిందితులు ఒకొక్కరికి రూ.1000 చొప్పున రూ.28వేల జరిమానా/మూడు రోజులు సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

కోదాడ రూరల్, మార్చి 4: ఆంధ్రా నుంచి తెలంగాణకు వస్తున్న అక్రమంగా వస్తున్న ఇసుక టిప్పర్‌ను సోమవారం మండలంలోని గుడిబండ వద్ద పట్టుకుని సీజ్ చేసినట్లు రూరల్ ఏఎస్‌ఐ ఆనంద్‌నాయక్ తెలిపారు. ఉదయం ఆరు గంటల సమయంలో రామాపురం క్రాస్‌రోడ్డు మీదుగా ఇసుకను తరలిస్తుండగా గుడిబండ వద్ద పట్టుకున్నామన్నారు. టిప్పర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేశామని తెలిపారు.

అక్రమ వ్యాపారాలపై నిఘా: సీఐ

కోదాడ రూరల్, మార్చి 4: అక్రమ వ్యాపారాలపై నిఘా పెట్టామని కోదాడ రూరల్ సీఐ రజితారెడ్డి అన్నారు. సోమవారం కోదాడలోని సీఐ కార్యాలయంలో ఆమె మాట్లాడారు. కోదాడ మండలం ఆంధ్రా సరిహద్దులో ఉన్నందున ఆంధ్రా నుంచి అక్రమంగా రవాణా చేసే ఇసుక, బియ్యం, గంజాయి, పశువుల వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఇప్పటికే కోదాడ సర్కిల్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లకు ఆదేశాలు జారీచేశామన్నారు. చెక్‌పోస్టుల వద్ద, అనుమానిత ప్రాంతాల్లో వాహనాలను నిరంతరం తనిఖీ చేస్తున్నామన్నారు. ఆంధ్రా సరిహద్దు గ్రామాల్లో మామిడి తోటల్లో పేకాట స్థావరాలపై దాడులు నిర్వహిస్తామన్నారు. యువత గంజాయికి అలవాటు పడకుండాఅవగాహన సదస్సులు నిర్వహిస్తామని, పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు నిత్యం గమనించాలన్నారు. అక్రమ రవాణాపై ప్రజలు రూరల్ సీఐ సెల్ నెం.8712686010, ఎస్ఐ సెల్ నెం.8712686043కు సమాచారం ఇవ్వాలని సూచించారు.

వైద్య ఖర్చుల డబ్బు ఇవ్వలేదని మహిళ ధర్నా

కోదాడ రూరల్, మార్చి 4: దాడి కేసులో వైద్య ఖర్చుల డబ్బు ఇవ్వడం లేదని బాధిత మహిళ ఓ వ్యక్తి ఇంటి ఎదుట ధర్నా చేసింది. ఏఎస్ఐ అనంద్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని యర్రవరం గ్రామానికి చెందిన సంఘ బంధం లీడర్ అళ్ల కళావతికి, అదే గ్రామానికి చెందిన రైతు నలజాల రాజారావుకు పరిచయం ఉంది. ఏడాది క్రితం ఇద్దరి మధ్య మనస్పర్ధలు రావడంతో కళావతిపై రాజారావు దాడి చేశాడు. ఈ ఘటనలో తలకు తీవ్రగాయమైన కళావతిని ఆమె కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి మూడు నెలల పాటు చికిత్స అందించగా ఆమె కోలుకుంది. దీనిపై కేసు పెట్టొదని వైద్య ఖర్చుల కోసం రూ.30 లక్షలు ఇస్తారని రాజారావు అంగీకరించాడు. నేటి వరకు ఆ డబ్బులు ఇవ్వకుండా, తనపై దౌర్జన్యానికి దిగుతున్నాడని కళావతి ఆరోపిస్తూ కుటుంబ సభ్యులతో కలిసి రాజారావు ఇంటి ఎదుట సోమవారం టెంట్ వేసి ధర్నాకు దిగింది. గ్రామస్తులు కొందరు ఆమెకు మద్దతు పలికారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువురితో చర్చించారు. ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించాలని రాజారావును పోలీసులు కోరగా, కొంత సమయం కావాలని అడిగాడు. ఈ ప్రతిపాదనకు కళావతి కూడా అంగీకరించి ధర్నాను విరమించింది.

ముందస్తు జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ



భద్రతా ప్రమాణం చేస్తున్న జెన్కో ఉద్యోగులు

మేళ్లచెర్వు, మార్చి 4: ప్రణాళికాబద్ధంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని పని చేయడంతోనే విద్యుత్ కేంద్రంలో ప్రమాదాలను నివారించామని పులిచింతల జెన్కో ఎస్ఈ దేశ్యానాయక్ అన్నారు. జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా సోమవారం మండల కేంద్రంలోని జెన్కో కార్యాలయంలో భద్రతా ప్రమాణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఈఈ రత్నం, రమేష్‌బాబు, సంతోష్‌కుమార్, రాజశేఖర్, దుర్గా భవాని, కుసుమ, కుమారి పాల్గొన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషిచేస్తాం



ఆలయ ప్రాంగణంలో బాధ్యతలు స్వీకరించిన నూతన పాలక మండలి సభ్యులు

మేళ్లచెర్వు, మార్చి 4: మండల కేంద్రంలోని శివాలయం అభివృద్ధికి కృషి చేస్తామని నూతన ఆలయ పాలకమండలి చైర్మన్ శాగంరెడ్డి శంభిరెడ్డి అన్నారు. ఆలయ నూతన కమిటీ సభ్యులతో ఆలయ ఈవో కొండారెడ్డి సోమవారం నియామకపత్రాలు అందజేసి, ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కమిటీ సభ్యులు మూడేళ్లు కొనసాగుతారని ఆయన తెలిపారు. కమిటీ సభ్యులుగా గుగులోతు పద్మ, గణేష్, సత్యనారాయణరెడ్డి, వెంకటేశ్వర్లు, చిన్నబాబు, గోవిందరెడ్డి, చందర్‌రావు, నాగిరెడ్డి, నర్సింహారావు, శంభయ్య, శంకర్, వెంకటేశ్వరరావు, ఆలయ ప్రధాన అర్చకుడు విష్ణువర్ధన్‌శర్మ కమిటీ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, బండారుపల్లి రామకృష్ణ, అన్నెవంగు శంభయ్య, పార్టీ మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, సైదేశ్వరరావు, గోవిందరెడ్డి, అచ్యుతరావు, ఫోన్‌రెడ్డి పాల్గొన్నారు.

'గొల్ల కురుమలకు నగదు బదిలీ చేయాలి'

నాగారం, మార్చి 4: గొల్ల కురుమలకు ప్రభుత్వం నగదు బదిలీ చేయాలని గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం(జీఎంపీఎస్) జిల్లా అధ్యక్షుడు కడెం లింగయ్య కోరారు. మండలంలోని ఈటూరు గ్రామంలో నిర్వహించిన జీఎంపీఎస్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గొర్రెల పంపిణీలో భాగంగా రెండో విడత పంపిణీ కోసం గత ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారుడి నుంచి రూ42వేల చొప్పున డీడీ తీసుకుందన్నారు. లబ్ధిదారులకు రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెసు ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున నగదును బదిలీ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. విదేశీ విద్య కోసం యాదవ సామాజిక విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, 50ఏళ్లు నిండిన యాదవులకు రూ.5వేల పింఛను ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. కార్యక్రమంలో కన్నెబోయిన కృష్ణయ్య, వెంకన్న, కడారి లింగయ్య, అవిలయ్య పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు రూ.15లక్షలు మంజూరు

హుజూర్‌నగర్, మార్చి 4: నీటి ఎద్దడి నివారణకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రూ.15లక్షలు మంజూరు చేసినట్లు ఎంపీపీ గూడెపు శ్రీనివాసు తెలిపారు. సోమవారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని బూరుగడ్డమాచవరానికి రూ.1.50లక్షలు, అమరవరానికి రూ.3లక్షలు, వేపలసింగారానికి రూ.2.50లక్షలు, లక్కవరానికి రూ.2లక్షలు, అంజలిపురానికి రూ.2లక్షలు, సీతారాంపురానికి రూ.2లక్షలు, కరక్కాయలగూడెంకు రూ.2లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. గ్రామాల్లో వాటర్ పైప్‌లైన్లు లీకేజీ కాకుండా చూడాలని, కొత్త బోర్లు ఏర్పాటుచేసి నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో లావణ్య, అధికారులు తుమ్మల శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, శ్యామల, గిరిజ, ఫణి, కవిత, కపిల్, ఇందిర, నాగమణి, అశోక్ పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వల ద్వారా 15రోజులపాటు నీటిని ఇవ్వాలి

తుంగతుర్తి, మార్చి 4: ఎస్సారెస్పీ కాల్వల ద్వారా నీటిని వారం రోజుల వరకు కాకుండా, 15రోజుల వరకు కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు ప్రభుత్వాన్ని కోరారు. తుంగతుర్తి మండలంలోని వెంపటి గ్రామంలో రైతు సంఘం సభ్యత్వ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వారానికోసారి నీటిని విడుదల చేయడం ద్వారా ఆత్మకూరు, సూర్యాపేట మండలాల్లో ఆయకట్టు చివరి భూములకు నీరందక పైర్లు పూర్తిగా ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దండ వెంకటరెడ్డి, ఉపాధ్యక్షుడు కందాల శంకర్‌రెడ్డి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, రైతు సంఘం సహాయ కార్యదర్శి పల్లా సుదర్శన్, ఉప్పలయ్య, విష్ణుమూర్తి, ముత్తయ్య, నాగయ్య, సోమయ్య పాల్గొన్నారు.

పులగంబండ తండాలో నీటి ఎద్దడిని నివారించాలి

నేరేడుచర్ల, మార్చి4: పులగంబండ తండాలో నీటి ఎద్దడిని నివారించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధూళిపాళ ధనుంజయనాయుడు కోరారు. సోమవారం సీపీఐ బృందంతో కలిసి పులగంబండతండాను సందర్శించి మాట్లాడారు. పులగంబండ తండా పంచాయతీ పరిధిలోని నాలుగు తండాల్లో తాగునీరు లేక గిరిజనులు ఇబ్బంది పడుతున్నారని, అధికారులు తండాలను సందర్శించి కొత్త బోర్లు వేయాలని సూచించారు. సాగర్ జలాలతో చెరువులను నింపడానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎల్లబోయిన సింహాద్రి, రావుల సత్యం, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, శ్రీను, మంగమ్మ పాల్గొన్నారు.

కూలీలకు 200రోజులు 'ఉపాధి' పనులు కల్పించాలి

మునగాల రూరల్, మార్చి 4: నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో కూలీలకు 200రోజులు ఉపాధిహామీ పనులు కల్పించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపల్లి సైదులు డిమాండ్ చేశారు. సోమవారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్కలపల్లి రాములు, వెంకటేశ్వరరావు, సత్యం, సోమపంగు జానయ్య, ఆరె రామకృష్ణారెడ్డి, జంపాల స్వరాజ్యం, రావులపెంట వెంకన్న, కేవీపీఎస్ జిల్లా నాయకుడు ఎస్.సైదులు పాల్గొన్నారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరస్వామి కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, తిలకిస్తున్న భక్తులు

హుజూర్‌నగర్, మార్చి 4: మండలంలోని వేపలసింగారంలో సోమవారం శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవలు, గణపతి పూజ, ధ్వజారోహణం, నిత్యహోమం అనంతరం స్వామివారి కల్యాణ వేడుకలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను దేవాలయం నుంచి ప్రత్యేక కల్యాణ మండపం వద్దకు పల్లకిలో తీసుకువచ్చి కల్యాణం నిర్వహించారు. కల్యాణాన్ని తిలకించడానికి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. రాత్రి సమయంలో గ్రామోత్సవం నిర్వహించి దేవతామూర్తులకు పవళింపుసేవ నిర్వహించారు. అనంతరం భజనమండలి ఆధ్వర్యంలో భక్తిపాటలు ఆలపించారు. కల్యాణం సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో చక్కెర వీరారెడ్డి, ముడెం రాధాగోపిరెడ్డి, కుందూరు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీపీ గూడెపు శ్రీనివాసు, దొంతగాని శ్రీనివాసు, హరిబాబు, సంపత్‌రెడ్డి, రామకృష్ణ, ఉత్సవ కమిటీ చైర్మన్ సారెడ్డి వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ అన్నెం వెంకటరెడ్డి, భిక్షం, వెంకటరెడ్డి, కోటిరెడ్డి, వెంకటాచారి, భిక్షారెడ్డి, బ్రహ్మారెడ్డి, అంజిరెడ్డి, సీతారాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

● వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవానికి నల్లగొండ జిల్లా పరిషత్ సీఈవో ప్రేమ్‌కరణ్‌రెడ్డి హాజరయ్యారు.

చివ్వెంల: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల కుటుంబాలకు పార్టీ అండగా ఉంటుందని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చీమ వెంకన్న సతీమణి ధనమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఆమె చిత్రపటానికి నివాళులర్పించి మాట్లాడారు. కాంగ్రెస్ మహిళా నాయకురాలిగా ప్రజల తరుపున పోరాటం చేసిన ధనమ్మ మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దరావత్ వీరన్ననాయక్, నాయకులు నంద్యాల సోమిరెడ్డి, చింతమల్ల రమేష్, వేముల చిన్న, ఎల్క నర్సిరెడ్డి, జాఫర్ పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో వృద్ధదంపతుల ఆత్మహత్యాయత్నం

● అడ్డుకున్న పోలీసులు ● కోడలు నిర్లక్ష్యం చేయడంతో కలెక్టరేట్‌కు



కలెక్టరేట్‌లో ఎలిశమ్మ నుంచి పురుగు మందు డబ్బాను తీసుకుంటున్న మహిళా పోలీస్, మెట్లపై కూర్చుని రోదిస్తున్న వృద్ధదంపతులు

సూర్యాపేట(కలెక్టరేట్), మార్చి 4: కలెక్టరేట్‌లో వృద్ధదంపతులు సోమవారం ఆత్మహత్యాయత్నం చేశారు. గమనించిన పోలీసులు ఆ పురుగుమందు డబ్బాను స్వాధీనం చేసుకుని కలెక్టర్ వద్దకు తీసుకెళ్లారు. బాధితుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మునగాల మండల కేంద్రానికి చెందిన పిడమర్తి ఎలిశమ్మ, వెంకన్న కుమారుడు చిరంజీవి ఉన్నాడు. వెంకన్న రిక్షా కార్మికుడిగా జీవనం సాగిస్తుండగా, కుమారుడు చిరంజీవి ఇంటెలిజెన్స్ సెక్యూరిటీ వింగ్‌లో కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి 2022 వరకు అప్పటి సీఎం కేసీఆర్ రక్షణ విభాగంలో విధులు నిర్వర్తించాడు. చిరంజీవికి మునగాల మండలం బరాఖత్‌గూడెంకు చెందిన రజనితో కులాంతర వివాహంకాగా, వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. 2022 జూన్ 6వ తేదీన చివ్వెంల మండలంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిరంజీవి మృతి చెందటంతో, ఆయన భార్య రజనికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చారు. ప్రస్తుతం ఆమె డీజీపీ కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తోంది. అదేవిధంగా ప్రభుత్వం నుంచి వచ్చే ఆర్థిక ప్రయోజనాలు(బెనిఫిట్స్) తల్లిదండ్రులతో పాటు చిరంజీవి కుమార్తెలకు చెందేలా 7 జూలై 2022న పెద్దమనుషుల సమక్షంలో తీర్మానం చేసుకున్నారు. అయితే ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ వచ్చినా పెద్దమనుషుల తీర్మానం ప్రకారం చిరంజీవి తల్లిదండ్రులకు ఇవ్వడం లేదు. ఈ విషయమై పలుమార్లు పోలీస్ అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో ఎలిశమ్మ-వెంకన్న దంపతులు తమకు పోషణ ఇబ్బందిగా ఉందని, తమకు జీవనభృతి కల్పించాలని కోదాడ ఆర్డీవోకు విన్నవించారు. దీనిపై వారికి నెలకు రూ.5 వేల చొప్పున ఇవ్వాలని 2023 ఆగస్టు 28వ తేదీన రజనికి కోదాడ ఆర్డీవో సూచించారు. అయినప్పటికీ ఆర్డీవో ఆదేశాలను ఆమె పాటించలేదని, తమ మనుమరాళ్లను కూడా చూడనివ్వడం లేదని దంపతులు ఆవేదన వ్యక్తంచేశారు. తమకు పోషణ ఇబ్బందిగా ఉందని, ఎక్కడా తమకు న్యాయం జరగకపోవడంతో కలెక్టరేట్‌కు వచ్చామన్నారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి హాజరైన వృద్ధ దంపతులు కలెక్టరేట్ లోని సమావేశ మందిరానికి సమీపంలో తమ వెంట తెచ్చుకున్న పురుగు మందు తాగేందుకు యత్నించగా, గమనించిన పోలీసులు అడ్డుకున్నారు. వారిద్దరినీ కలెక్టర్ వెంకటరావు వద్దకు తీసుకెళ్లగా వారు తమ సమస్యను వివరించారు. స్పందించిన కలెక్టర్ వృద్ధ దంపతుల సమస్యను వెంటనే పరిష్కరించాలని జిల్లా సంక్షేమాధికారి వెంకటరమణను ఆదేశించారు.

ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలి



ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లుగౌడ్

హుజూర్‌నగర్ రూరల్, మార్చి 4: ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ పార్టీ ప్రధానకార్యదర్శి మండవ వెంకటేశ్వర్లుగౌడ్ అన్నారు. హుజూర్‌నగర్‌లోని కోదాడ రోడ్డులో ఎన్టీఆర్ విగ్రహాన్ని సోమవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తుది శ్వాస వరకు పేదల సంక్షేమానికి పాటుపడిన ఎన్టీఆర్ ప్రజల గుండెల్లో కొలువై ఉన్నారన్నారు. సినీ, రాజకీయాల్లో ధ్రువ తారగా వెలుగొందిన ఎన్టీఆర్‌కు కేంద్ర ప్రభుత్వం భారతరత్న ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ ఆశయాలను సాధించాలన్నారు. కార్యక్రమంలో కె.వెంకటేశ్వర్లు, శీతల రోషపతి, రాములు, నాగయ్య, వెంకటయ్య, కనకరత్నం, రామారావు, బాలాజీ, వెంకటేశ్వర్లు, గోపి, రామకృష్ణ, వెంకన్న, సైదులు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సాగర్ నీటితో చెరువులు, కుంటలు నింపాలి

మఠంపల్లి, మార్చి 4: సాగర్ ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసి చెరువులు, కుంటలను నింపి తాగు నీటి, సాగు నీటి సమస్యను పరిష్కరించాలని మిర్యాలగూడ మాజీ ఎమ్మెల్యే, సీపీఎం రాష్ట్ర కార్యదర్శ వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి అన్నారు. మఠంపల్లి మండల కేంద్రంలో సోమవారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు.ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న పేదలందరికీ రేషన్ కార్డులు మంజూరుచేసి సంక్షేమ పథకాలను అందించాలని కోరారు. పెదవీడు రెవెన్యూ పరిధిలోని సర్వే నెం. 540లో ఉన్న భూసమస్యను మంత్రి ఉత్తమ్ ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించి గిరిజన రైతులను న్యాయం చేయాలని కోరారు.కార్యక్రమంలో నాయకులు భూక్య పాండునాయక్, మాలోతు బాలునాయక్, శీలం శ్రీను, పోసబోయిన హుస్సేన్, సయ్యద్ రసూమియా, వెంకటరెడ్డి, రవి, కోటయ్య, రాము, లింగమ్మ, చల్లా లింగయ్య, అశోక్ పాల్గొన్నారు. మండల కేంద్రంలో సీపీఎం నాయకుడు చింత శేషగిరిరాజు సతీమణి లక్ష్మమ్మ మృతి చెందగా, ఆమె మృతదేహనికి రంగారెడ్డి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

క్రీడాస్ఫూర్తితో పోటీలు నిర్వహించాలి

మేళ్లచెర్వు, మార్చి 4: మహాశివరాత్రి జాతర సందర్భంగా మేళ్లచెర్వులో నిర్వహించే కబడ్డీ పోటీలను క్రీడాస్ఫూర్తితో నిర్వహించాలని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని క్యాంపు కార్యాలయంలో కబడ్డీ పోటీల పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో వీరారెడ్డి, శంకర్‌రెడ్డి, గురవారెడ్డి, మంద రవి, నరేంద్ర, నిరంజన్, అవినాష్ పాల్గొన్నారు.



ఆత్మకూర్(ఎస్): ఇటుక బట్టీల్లో పనిచేస్తున్న బాలలను బడిలో చేర్పించి, రక్షణ కల్పించాలని ఎంవీఎఫ్ ఫౌండేషన్ మండల ఇన్‌చార్జి వత్సవాయి లలిత, నాయిని సైదులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ వినోద్‌కుమార్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి ఆదివారం అవగాహన సదస్సును ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జయలలిత, వెంకన్న, లింగరాజు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్: మహాశివరాత్రి సందర్భంగా పట్టణంలోని పార్వతీ సహిత భీమలింగేశ్వరస్వామి దేవాలయంలో నిర్వహించనున్న ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ బెల్లంకొండ అమర్‌గౌడ్ కోరారు. సోమవారం పట్టణంలోని శివాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎసమావేశంలో పెద్ది పుష్ప, శ్రీనివాసాచారి, రాజు పాల్గొన్నారు.

● ప్రజల సహకారంతో అభివృద్ధి పనులు చేస్తామని మునిసిపల్ వైస్ చైర్మన్ వైస్ చైర్మన్ సంపత్‌రెడ్డి అన్నారు. వైస్ చైర్మన్‌గా ఎంపికైన సంపత్‌రెడ్డిని పట్టణంలోని 3వ వార్డు ఎన్జీవో కాలనీలో పౌర సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో శరణ్య, పార్వతి, లింగారెడ్డి, శివ, శ్రీనివాస్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మఠంపల్లి: సామాజిక సేవలో ఓజో ఫౌండేషన్ చేస్తున్న సేవలు మరువలేనివని ఉమ్మడి నల్గొండ బీఆర్ఎస్ పార్టీ యూత్ అధ్యక్షుడు మారెపెద్ది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని యాతావాకిళ్ల గ్రామానికి చెందిన ఓజో ఫౌండేషన్ వ్యవస్థాపకుడు పిల్లుట్ల రఘు తండ్రి వీరయ్య ఇటీవల మృతి చెందగా, ఆయన చిత్రపటానికి పూలమాలల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎల్లావుల నాగయ్యయాదవ్, ప్రకాష్, కొత్తూరి వెంకన్న, కుర్రి కాశయ్య, లచ్చయ్య పాల్గొన్నారు.

● మఠంపల్లి మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో సోమవారం నృసింహుని నిత్య కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. పూజల అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నేరేడుచర్ల: నేరేడుచర్ల మునిసిపాలిటీలో అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని టీడీపీ మండల అధ్యక్షుడు ఇంజమూరి వెంకటయ్య కోరారు. పటణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. అగ్నిమాపక కేంద్రం మంజూరుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కృషి చేయాలని కోరారు.

● 'ఉపాధి' నిధులు రూ.30లక్షలతో కల్లూరు గ్రామంలో సీసీ రోడ్డు మంజూరు కాగా, ఆ పనులను జడ్పీటీసీ రాపోలు నర్సయ్య సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో చిల్లేపల్లి సింగిల్‌విండో చైర్మన్ గంగా రంగారెడ్డి పాల్గొన్నారు.

కోదాడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని కేఆర్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.నాగు అన్నారు. హైదరాబాద్‌లో జరిగిన 49వ జూనియర్ నేషనల్ కబడ్డీ పోటీల్లో రాణించిన విద్యార్థిని టి.కృష్ణవేణిని కళాశాలలో సోమవారం సన్మానించారు.

కోదాడ రూరల్: మండలంలోని రామలక్ష్మీపురం గ్రామంలో ఉన్న శ్రీసీతారామచంద్ర స్వామి దేవాలయం 13వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల ఆరో తేదీన సీతారాముల కల్యాణం నిర్వహిస్తునట్లు ఆలయ చైర్మన్ అన్నెం చినవెంకట్‌రెడ్డి తెలిపారు. కోలాట బృందాల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణాన్ని నిర్వహించడానికి ఏర్పాట్లు చేశామన్నారు.

చిలుకూరు: మండలంలోని నారాయణపురం ప్రాథమిక పాఠశాలలో 70మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌లను ఇన్ఫోసిస్ కంపెనీ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నలబోలు సంజీవ్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ శంకర్, కార్యదర్శి శౌరిక, హెచ్ఎంశ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతన్‌కల్: దేశంలో కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు ఇందూరు సాగర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గుగంటి సత్యనారాయణ విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో సతీష్, నగేష్, నర్సింహ, మధు పాల్గొన్నారు.

నాగారం: కాంగ్రెస్ పార్టీ భువనగిరి ఎంపీ టిక్కెట్‌ను పీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చామల కిరణ్‌కూమార్‌రెడ్డికి ఇవ్వాలని యూత్ కాంగ్రెస్ మండల నాయకుడు దాసరి లింగస్వామి సోమవారం ఒక ప్రకటనలో కాంగ్రెస్ అధిష్ఠానాన్ని ఒక ప్రకటనలో కోరారు.

● ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీల్లో భాగంగా 200 యూనిట్ల లోపు విద్యుత్‌ను వినియోగించే గృహ విద్యుత్ వినియోగదారులుకు జీరో బిల్లును అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించడంపై యూత్ కాంగ్రెసు మండల జనరల్ సెక్రటరీ షేక్ వలీ హర్షం వ్యక్తం చేశారు. నాగారం మండలంలోని శాంతినగర్ గ్రామంలో విద్యుత్ అధికారులతో కలిసి జీరో బిల్లును అర్హుల ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు.

మద్దిరాల: విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మండలంలోని చిననెమిల గ్రామ జడ్పీ హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేసి ఆయన మాట్లాడారు.

● గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జడ్పీటీసీ కన్నసురాంబవీరన్న అన్నారు. మద్దిరాల మండలంలోని జి.కొత్తపల్లి గ్రామంలో ఉపాధి నిధులు రూ.10లక్షల వ్యయంతో నిర్మించే సీసీ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేసి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొబ్బిలి నర్సమ్మ, అవిలమల్లు, బొబ్బిలి వెంకన్న పాల్గొన్నారు.

నూతన్‌కల్: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించాలని తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గరిధర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగం సుధాకర్‌రెడ్డి కోరారు. మండలంలోని మిర్యాల గ్రామంలో నూతన గ్రామ కమిటీని ఎంపిక చేశారు. గ్రామ శాఖ అధ్యక్షుడిగా మన్నెం దశరథ, ఉపాధ్యక్షులుగా అన్నాపురం శ్రీశైలం, రాచకొండ ఎల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా శ్రవణ్‌ను ఎన్నుకున్నారు.